క్లుప్తంగా

ముత్యాలమ్మ జాతరకు విరాళం



విరాళం అందజేస్తున్న మురళీకృష్ణ దంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన ముత్యాలమ్మ ఆలయ జాతర నిర్వహణకు పట్టణానికి చెందిన బజాజ్ షోరూం అధినేత మురళీకృష్ణ బుధవారం రూ.26వేలు విరాళంగా అందజేశారు. విరాళాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతలకు స్వామి అమ్మవార్ల ప్రత్యే దర్శన ఏర్పాట్లు చేశారు. పాలకమండలి సభ్యులు పసల సుమతి, అధికారులు సుదర్శన్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

సత్యవేడు: తమిళనాడులోని తిరువణ్ణామలైకు పౌర్ణమి రోజున అరుణాచలేశ్వరుడి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం వెంకటరమణ తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమి రోజు సత్యవేడు నుంచి తిరువణ్ణామలైకు ఆర్టీసీ బస్సు వెళుతుందన్నారు. సత్యవేడు నుంచి బయలు దేరే బస్సులు పుత్తూరు, వయా చిత్తూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, తిరువణ్ణామలైకు వెళుతుందన్నారు. గిరి ప్రదర్శన అనంతరం భక్తుల సౌకర్యార్థం తిరువణ్ణామలైలో ఉదయం 5 గంటలకు బస్సు బయలుదేరి సత్యవేడుకు వస్తుందన్నారు. ఈ సౌకర్యాన్ని ఆర్టీసీ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని తెలుగుగంగ కార్యాలయం వద్ద బుధవారం స్వచ్ఛత రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మావుడూరు మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర నేత్రాలయ హాస్పిటల్ మిషన్ ఫర్ విజన్ ట్రస్టు వైద్యులు శిబిరంలో పాల్గొని, 68 మందికి వైద్య పరీక్షలు చేశారు. 68 మందిలో 28 మందికి చెన్నైలోని శంకర నేత్రాలయలో ఉచితంగా కంటికి ఆపరేషన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుగంగ డీఈ పెంచలయ్య పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్‌లు అందజేస్తున్న మురుగేష్

ఏర్పేడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వన్స్ హెల్ప్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలోని 110 మంది పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్సిళ్లు, పెన్‌లు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వన్స్ హెల్ప్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు మెరుం మురుగేష్, హెచ్‌ఎం సునీత, ఫౌండేషన్ కార్యదర్శి మునేంద్ర, సభ్యులు దీనదయాళ్, బాబు, శేఖర్, రాజా, ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశభక్తి ముసుగులో సహారా ఆర్థిక నేరాలు



సమావేశంలో మాట్లాడుతున్న పూజిత

శ్రీకాళహస్తి: దేశభక్తి ముసుగులో సహారా ఆర్థిక నేరాలకు పాల్పడుతోందని ఆల్ ఇండియా జన సంఘర్ష్ మోర్చ (ఏఐజేఏఎస్‌ఎం) జాతీయ అధ్యక్షురాలు పూజిత అన్నారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సహారా సంస్థ అధినేత సుబ్రతో రాయ్ దేశభక్తి ముసుగులో లక్షల కోట్ల రూపాయల ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని ఆరోపించారు. జైలులో ఉండాల్సిన ఆయన పెరోల్‌పై హాయిగా బయట తిరుగుతున్నారన్నారు. సహారా సంస్థ నుంచి బాధితులకు నయా పైసాతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. 45 ఏళ్ల కాలంలో లక్షల కోట్ల ఆర్థిక నేరాలకు పాల్పడిందని ఆరోపించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆశ చూపి స్కీములు పెట్టి స్కాములు చేశారన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోనే 15వేల మందికి పైగా బాధితులు ఉండడం విచారకరమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బాధితులకు న్యాయం జరిగేలా కృషిచేయాలన్నారు. సహారా బాధితులకు న్యాయం కోసం ఏప్రిల్ 3న తిరుమలకు పాదయాత్ర చేపడుతున్నామని 4న తిరుపతిలో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తి ప్రాంత బాధితుల సాయం కోసం 9121099373 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దీపిక, జయశ్రీ పాల్గొన్నారు.

అక్క, చెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి ఆసరా





సత్యవేడు: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, కేవీబీపురంలో చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: డ్వాక్రా అక్క, చెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి ఆసరాగా ఉండేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశ పెట్టారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సత్యవేడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలనే మహోన్నత లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మఒడి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సత్యవేడు మండలంలో 977 సంఘాలకు మూడు విడతలుగా రూ. 27.77 కోట్లు మంజూరైయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యుడు పి. విజయలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మంజుల, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, రమేష్, బొప్పన సోమశేఖర్, ఆనంద రెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి, రమణ, గోవిందస్వామి, మదుసూదనరాజు, కే.శెల్వి, డి.సరోజిని, వీడీ శరవణ్, రూబెన్, ఏ.నాగమ్మ, ఎం. సుధాకర్, జీ.శేఖర్, టి.జయ, ఎస్.శివరంజని, బాలాజి పాల్గొన్నారు.

మహిళల సాధికారతే లక్ష్యం

కేవీబీపురం: మహిళల సాధికారతే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడేళ్ల జగనన్న పాలనలో రాష్ట్రంలోని మహిళలు మునుపటి కన్నా మెరుగ్గా ఆర్థికాభివృద్ధి సాధించారన్నారు.

టీడీపీవి శునకానంద వేడుకలే

టీడీపీ నేతలవి శునకానంద వేడుకలేనని ఎమ్మెల్యే ఆదిమూలం తనదైన శైలిలో మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 21 స్థానాలకు ఎన్నికలు జరిగితే అందులో 17 స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకోగా, టీడీపీ కేవలం నాలుగింటికే పరిమితమై జగనన్న చేతిలో మళ్లీ ఘోరంగా ఓటమి పాలైందన్నారు. అంతకుముందు సీఎం చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనుంజయరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవి, వైఎస్ ఎంపీపీలు సరస్వతి, శ్రీనివాస్ యాదవ్, నేతలు నందకుమార్, లాల్ బాబు యాదవ్, సుబ్బన్న, హరిబాబు, శాస్త్రిరాజు, రమాదేవి, అయ్యప్పరెడ్డి, గిరి, ప్రేమ్, జాకీర్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో మంత్రి అంబటి



మంత్రి అంబటికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ చైర్మన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి అంబటి రాంబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): భావితరాలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని జిల్లా భూగర్భ జల వనరులశాఖ ఉపసంచాలకులు ఎం. నాగమల్లేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని జీవనోపాధుల వనరుల కేంద్రంలో భూగర్భజల స్థితి, పర్యవేక్షణ, స్థిరమైన అభివృద్ధి అంశాలపై విద్యార్థులకు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీరు చాలా విలువైనదని నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలియజేశారు. అలాగే రైతులు పంటల కోసం భూగర్భ జలాలను పరిమితంగా వినియోగించాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకుంటేనే అందరికి భవిష్యత్ ఉంటుందని తెలియజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సంబంధం శెట్టి,రియల్ స్వచ్ఛంధ సేవా సంస్థ వ్యవస్థాపకులు రామారావు, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, భూగర్భ జల, జలగణన శాఖ శాస్త్రవేత్తలు నవీన్ బాబు, రాజారావు, సీఎస్ స్వామినాథన్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కందాడులో ఉచిత కేన్సర్ పరీక్షలు



కేన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: స్థానిక వినాయక స్వామి ఆలయం వద్ద రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్, తిరుపతి టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కేన్సర్ పరీక్షలు జరిగాయి. ఏర్పేడు, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, ఆమందూరు, బాలకృష్ణాపురం గ్రామాల నుంచి వచ్చిన 150 మందికి నోటి, రొమ్ము, గర్భముఖ కేన్సర్, హైపటైజ్, బీపీ, మెమోగ్రామ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. 30 నుంచి 65 ఏళ్ల లోపు మహిళలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కేన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ భార్గవ్, టాటా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ రెడ్డికుమారి, ప్రోగ్రాం మేనేజర్ పీపీ హుమంత్‌కుమార్, రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ ఎలగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా అశోకచక్రవర్తి జయంతి



బోర్డుకు పూజలు చేస్తున్న శివయ్య

ఏర్పేడు: స్థానిక అశోక్‌నగర్‌లో బుధవారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో అశోక చక్రవర్తి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అశోక్ నగర్ బోర్డుకు పూజలు చేసి, మిఠాయిలు, స్వీట్లు పంపిణీ జేసి మొక్కలు నాటారు. వీఆర్వో బాలాజీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కలపాటి గురవమ్మ, ఏఎన్‌ఎం రీటా, అంగన్‌వాడీ కార్యకర్త అన్నపూర్ణ పాల్గొన్నారు.

పాఠశాలకు పాత్రల వితరణ



పాత్రలను వితరణగా అందజేస్తున్న రాధాకృష్ణయ్య శెట్టి

వరదయ్యపాళెం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థి బొప్పన రాధాకృష్ణయ్య శెట్టి రూ. 35వేల విలువ చేసే వంట పాత్రలను పాఠశాలకు వితరణగా అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌బాబుకు వంట పాత్రలను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని పూర్వ విద్యార్థి పేర్కొన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బందిల కుమార్, బొప్పన మురళీమోహన్ పాల్గొన్నారు.

రాములవారికి ముక్కంటి సారె



రాములవారికి సారె అందజేస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీరామనవమి పురస్కరించుకుని పట్టణంలోని రాములవారి మందిరాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున బుధవారం ముక్కంటి సారెను పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సమర్పించారు. పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న సర్పంచ్ రవిరెడ్డి



వరదయ్యపాళెం: మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

సత్యవేడు: పోషకాహారంతోనే ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచ్ రవిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దాసుకుప్పం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే వైఎస్సార్ కిట్లు, బాలామృతంతోపాటు పాఠశాల్లోని మధ్యాహ్న భోజనంలో పలు పోషక విలువలు కలిగిన పదార్థాలున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పోషకాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తప్పకుండా తీసుకోవాలని కోరారు. సీడీపీఓ దేవకుమారి మాట్లాడుతూ చిరుధాన్యాల్లోనూ పుష్కలంగా పోషకాలున్నాయని చెప్పారు. మహిళల్లో రక్త హీనత నివారించేందు రాగులు, సజ్జలు, మినుములు, కొర్రలు, జొన్నలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రమ్మ, రుక్మిణి పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ

వరదయ్యపాళెం: గర్భిణులు, బాలింతలు, పిల్లలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకుంటే రక్తహీనత నివారించవచ్చని మండల ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి అన్నారు. పోషణ్ పక్వాడ పక్షోత్సవంలో భాగంగా బుధవారం వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయంలో చిరుధాన్యాలుపయోగించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న వంటల పోటీలు నిర్వహించారు. సామూహిక సీమంతం నిర్వహించారు. సీడీపీఓ దేవకుమారి మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల్లో ఎక్కువ శాతం విటమిన్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, యూత్ మండల కన్వీనర్ వినోద్ యాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, ఎంఈఓ సరస్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

భావితరాలకు ఆధ్యాత్మిక సంపద తెలియజేయాలి



భక్తులకు అన్నదానం చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: భావితరాలకు మన ఆధ్యాత్మిక సంపదను తెలియజేయాల్సిన ఆవశ్యకత మన అందరిపైన ఉందని తొట్టంబేడు, రేణిగుంట మండలాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని అబ్బాబట్లపల్లి దళితకాలనీలో బుధవారం సీతారాముల కుంభాభిషేక మహోత్సవం నిర్వహించారు. ముందుగా ఆమె స్వామి అమ్మవార్లను దర్శించుకుని కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. హైందవ ధర్మంలో దేవాలయాలు మానవతా వికాస కేంద్రాలుగా వర్ధిల్లుతున్నాయని తెలిపారు. మానవుల సర్వతోముఖాభివృద్ధికి భక్తి మార్గమే ఏకైక మార్గమని చెప్పారు. దేవాలయాల ద్వారా ఆధ్యాత్మికత, జ్ఞానం, విద్య, సాంస్కృతిక చైతన్యాన్ని పొందొచ్చని వివరించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో వందలాది ఆలయాలను నిర్మించారని ఆమె అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాలు లేకుంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకొస్తే ఆలయ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తారని చెప్పారు. అనంతరం భక్తులకు ఆమె అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి, రామాపురం సర్పంచ్ పుట్టంరెడ్డి బాలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు భాస్కర్, మాతయ్య, బత్తిరెడ్డి, బాలగురవయ్య, బాలసుబ్రమణ్యం, వెంకటస్వామి, దత్తు, బత్తెయ్య, మురళి పాల్గొన్నారు.

క్రీడాకారులకు బ్యాట్ల పంపిణీ



క్రీడాకారులకు బ్యాట్లు అందజేస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 7, 8, 9వ తరగతి చదువుతున్న 32మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి క్రీడాకారులకు టేబుల్ టెన్నిస్ బ్యాట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఇలాంటి క్రీడాపోటీలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామన్నారు. పాఠశాల డ్రిల్ మాస్టర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆర్కాడు శంకర్, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సభ్యుడు మున్నారాయల్, వైఎస్సార్‌సీపీ నేతలు కాపిరెడ్డి ఢిల్లీబాబురెడ్డి, మునిరామయ్య, నాగేంద్రబాబురెడ్డి, బాబు పాల్గొన్నారు.

విద్యాదీవెన కానుకల పంపిణీ



విద్యాదీవెన అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని చిట్టత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం సిపాయి విద్యా దీవెన కానుకలను ఎమ్మెల్సీ డాక్టర్. సిపాయి సుబ్రమణ్యం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గురువులు, తల్లిదండ్రులు గర్వపడే విధంగా పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ఉన్నత విద్యలో రాణించాలంటే పదవ తరగతిలో వచ్చే మార్కులతో మీ జీవితం ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నతగా రాణించాలంటే క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రశేఖర్ నాయుడు ఉపాధ్యాయులు, నరేందర్ రెడ్డి, మురళి, సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ నరసింహులు, సచివాలయ కన్వీనర్ సురేష్, నేతలు కృష్ణారెడ్డి, తిరుమలరెడ్డి, రమణారావు, డాక్టర్. బాబురావు, చంద్రారెడ్డి, దీపక్ రెడ్డి పాల్గొన్నారు.

ప్యాడ్‌లు, జామెంట్రీ బాక్సుల వితరణ



అట్టలు, జామెంట్రీ బాక్సులు అందజేస్తున్న టీచర్ రంజిత్ కుమార్

పిచ్చాటూరు: నాగలాపురం మండలం ఎస్ఎస్ పురం జెడ్పీ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు కాలిఫోర్నియాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ యశ్వంత్ దాతృత్వంతో పరీక్ష అట్టలు, జామెంట్రీ బాక్సులు వితరణ చేశారు. పాఠశాలలోని గణిత ఉపాధ్యాయుడు రంజిత్ కుమార్ చేతల మీదుగా వాటిని అందజేశారని ఎస్ఎం ఉదయచంద్రిక తెలిపారు. పీసీ చైర్మన్ రఘురామయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ గిరిబాబు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే పేదరిక నిర్మూలన



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న మేనేజర్

శ్రీకాళహస్తి రూరల్: ఉన్నత విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని శ్రీకాళహస్తి బ్రాంచ్ బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ యాసిన్ బాషా పేర్కొన్నారు. హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం అక్కుర్తి, పెద్ద కనపర్తి, పిల్లమేడు, కాసరం, బండారుపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆయన పరీక్షా సామగ్రిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్ అందిస్తున్న సాయం మంచిదని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆదుకోవడానికి మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హెల్పింగ్ హార్ట్స్ వ్యవస్థాపకులు ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు మురళి, గోపి, సాయికృష్ణ, గజేంద్ర, దామోదరం పాల్గొన్నారు.

నవమికి ముస్తాబైన ఆలయాలు



పెద్ద పాండూరులోని సీతా సమేత కోదండ రామాలయం



హీరో పరిశ్రమ సమీపంలోని సీతారామ ఆలయంలో స్వామిఅమ్మవార్లు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులో సీతా సమేత కోదండ రామాలయం నవమి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆ మేరకు ఈనెల 30 నుంచి ఏప్రిల్ 1 వరకు మూడు రోజులపాటు ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని నూతన రంగులతో, విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేస్తున్నారు. నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీరామ నవమి సందర్భంగా స్వామిఅమ్మవార్ల కల్యాణం, శుక్రవారం స్వామివారి పట్టాభిషేకం, శనివారం వసంతోత్సవం జరగనుంది. సమీప గ్రామాల నుంచి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండడంతో ఆలయ ధర్మకర్త, విశ్రాంత రాష్ట్ర ఆర్అండ్‌బీ ఇంజనీర్ పరంధామరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా హీరో పరిశ్రమ సమీపంలోని మాదనపాళెం గ్రామానికి చెందిన సీతారామ కోదండరామ ఆలయం నవమి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆ మేరకు గురువారం ఉదయం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు, సాయంత్రం కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.